అధ్వాన దారులు..!

- నియోజకవర్గంలో నత్తనడకన బీటీరోడ్డు పనులు
- కంకర వేసి వదిలేయంతో వాహనదారుల ఇక్కట్లు
- మూలుగుతున్న నిధులు.. ముందుకు సాగని పనులు



తిప్రస్‌పల్లి నుంచి దాదాన్‌పల్లి వెళ్లే రోడ్డు ఇలా..



ముస్టిపల్లికి వెళ్లే రోడ్డు ఇలా..

మక్తల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలకు బీటీ రోడ్లకోసం నిధులు మంజూరుచేసిన నేటి వరకు కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. మక్తల్ నియోజకవర్గంలో రోడ్లకు నిధులు మంజూరు చేసి నెలలు గడుస్తున్నా.. పనులు ముందుకు సాగడం లేదు. కాంట్రాక్టర్లు మాత్రం పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు పనులు చేసిన తమకు బిల్లులు రావడం లేదని వదిలేస్తున్నారు. రోడ్లపై కంకర వేసి వదిలేయంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. తిప్రాస్‌పల్లి నుంచి దాదాన్‌పల్లి వరకు పనులు చేసేందుకు ఎఫ్‌డీఆర్ నిధులు నుంచి రూ. 20లక్షలు మంజూరైంది. కృష్ణా మండలం నుంచి గురుజాల్ గ్రామం వరకు రూ. 2కోట్ల 40లక్షలు మంజూరైంది. మాగనూర్ మండలానికి రూ. 3కోట్ల 80లక్షలు మంజూరైంది. ఊట్కూర్ మండలంలోని కొత్తపల్లికి రూ.1కోటి 90 లక్షలు, నర్వ మండలానికి జక్కనపల్లి బీటీ రోడ్డుకు రూ. 2కోట్ల 90 లక్షలు మంజూరైయ్యాయి.

రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు

అదేవిధంగా మక్తల్ నియోజకవర్గంలో రూ. 47కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు అధికారులకు ప్రతిపాదనలు అందజేశారు. సంబంధిత శాఖలతో అనుమతి వస్తే రోడ్లకు మహర్దశ రానుందని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. జక్లేర్ నుంచి పులిమామిడి వరకు బీటీరోడ్డు కోసం నిధులు మంజూరైయ్యాయి. దాసర్‌దొడ్డి, కాట్రిప్‌పల్లి గ్రామాలకు నేటివరకు బీటీ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మక్తల్, నారాయణపేట నియోజకవర్గంలో బీటీ రోడ్లకు నిధులు మంజూరైన వాటికి పనులు చేపడుతాం. కృష్ణా,మాగనూర్, నర్వ, ఊట్కూర్ మండలాల గ్రామాలకు నిధులు మంజూరైంది. వారంలో టెండర్లు పూర్తయితే వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

\- హీర్యా నాయక్, పంచాయతీ రాజ్ ఈఈ నారాయణపేట

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రేవతి

నారాయణపేట: వాహనదారులు వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని ఎస్‌ఐ రేవతి హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని సూచించారు. వాహనానికి సంబంధించిన ఆర్‌సీ డ్రైవింగ్, లైసెన్స్, ఇన్స్‌రెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. మద్యపానం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరిగా వేయించుకోవాలని, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపొద్దన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఆంజనేయులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న ఫౌండేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్

ఊట్కూరు: మండలంలోని శ్రీరాంనగర్‌లో మేము సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్. రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. వెనుకబడిన తరగతుల్లో ఉన్నటువంటి అణగారిన విద్యార్థులు సమాజంలో జీవించాలంటే సరైనా ఆంగ్ల బోధన లేక ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి విద్యార్థుల్లో ఆంగ్లంపై అవగాహన కల్పించేందుకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింగప్ప, అశోక్, భరత్‌కుమార్, చైర్మన్ వెంకటేష్, గౌతం, తిమ్మప్ప, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెలగని హైమాస్ట్ లైట్లు



దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తిలో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లు వెలగడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేసిన లైట్లు పునరుద్ధరణకు నోచుకోవడం లేదు. గ్రామ పంచాయతీ అధికారుల నిర్వహణ చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారిందని స్థానిక యువకుడు సురేష్ తెలిపారు. పలుచోట్ల ఏర్పాటుచేసిన సోలార్ లైట్లు మరమ్మతు చేపట్టకపోవడంతో వెలగడం లేదని, అధికారులు వీధి దీపాలను అమర్చి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

పల్లె దవాఖాన ప్రారంభమయ్యేనా?



కొత్తపల్లి: మండల పరిధిలోని బూనీడు పంచాయతీలో పల్లె దవాఖాన నిర్మించి రెండు సంవత్సరాలు గడుస్తున్నా నేటికి ప్రారంభానికి నోచుకోవడం లేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 20లక్షలతో నిర్మించిన దవాఖాన అధికారుల నిర్లక్ష్యంతో గ్రామ ప్రజలకు మాత్రం శాపంగా మారింది. కోడంగల్ నియోజక వర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నా పూర్తిచేసుకున్న పల్లె దవాఖాన ప్రారంభించ లేకపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పల్లె దవాఖానను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

గుంతలు పూడ్చివేత



కోస్గి రూరల్: పట్టణంలోని 9వ వార్డులో నెలకొన్న సమస్యలపై కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి అధికారులకు ఆదేశించిన పట్టించుకోవడం లేదు. ఆదివారం మాజీ వార్డు మెంబరు వెంకట నర్సింహులు స్పందించి ట్రాక్టర్‌లతో మట్టితో తరలించి గుంతలను పూడ్చారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

నిబంధనలకు తూట్లు..



మాగనూర్: మండల కేంద్రం మీదుగా కొత్తపల్లి, కున్సీ, హిందూపూర్, కృష్ణా గ్రామాలకు వెళ్లే పల్లె వెలుగు బస్సులో కళాశాల, పాఠశాలల విద్యార్థులు పరిమితికి మించి ప్రయాణం చేస్తున్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఆయా గ్రామాల నుంచి నిత్యం వచ్చే విద్యార్థుల కోసం గతంలో బస్సును ఏర్పాటుచేశారు. ప్రయాణ సమయంలో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. దీంతో విద్యార్థులకు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు ప్రమాదం జరగక ముందే స్పందించాలని పలువురు కోరుతున్నారు.

నేడు క్రిస్మస్ వేడుకలు

నర్వ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11గంటలకు నిర్వహించే ఈ వేడుకలకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల సేకరణ

ఆత్మకూర్: పట్టణంలోని రాజవీధిలో పెద్దమ్మ తల్లి ఆలయ పునఃనిర్మాణానికి నిర్వాహకులు విరాళాలు సేకరించారు. వందల ఏళ్ల క్రితం నిర్మించిన పెద్దమ్మ ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో పునర్నిర్మాణానికి స్థానికులు పూనుకున్నారు. ఇందుకు గాను రూ.2 కోట్లు అవసరమని కావడంతో ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.4.50 లక్షల వరకు విరాళాల వసూలు అయ్యాయని నిర్వాహకులు తెలిపారు.

శారద మాత సందేశం ఆచరణీయం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సేవా సమితి సభ్యులు

దామరగిద్ద: శారదమాత జీవిత సందేశం సామాజిక ఆధ్యాత్మిక చైతన్యానికి నాంది పలికిందని రామకృష్ణ సేవాసమితి గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మద్దెల్‌బీడ్‌లో శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో శారదమాత జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మికంగా సామా జికంగా భక్తుల్లో చైతన్యం కల్పించిన గొప్ప మాతృమూర్తి శారదమాత అన్నారు. అంతకుముందు తెల్లవారుజామున నగర సంకీర్తన, శుప్రభాత సేవా, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం, ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం ప్రత్యేక భజనలు నిర్వహించారు. భజన మండల సభ్యులకు శాలువాతో సత్కారం చేపట్టారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు నర్సింహులు, గోపాల్, వెంకట్రాములు, జె. గోపాల్, కృష్ణ, మోహన్, కుర్వ వెంకటప్ప, సాయిరెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



ఊట్కూరు: మండలంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద మహాపడిపూజను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి కలశ శోభాయాత్రను చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు ఆయనకు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బాబు గురుస్వామి, శివరాం స్వామి, ఎల్లగౌడ్, రాంరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక



కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

మక్తల్: సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని సంగంబండ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన శివమణి, శిరీష, శాలిని, మహేశ్వరి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 27 నుంచి జనవరి 2వరకు హైదరాబాద్‌లో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. అనంతరం వీరిని పీఈటీ శ్రీలత, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థినికి అభినందన

మరికల్: సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నందిని ఎంపికైనట్లు జీహెచ్‌ఎం మనోరంజని ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 21నుంచి 26వరకు మేడ్చల్ జిల్లా హకీంపేట్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. పోటీలకు ఎంపికైన నందిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ



ధన్వాడ: ఓపెన్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశామని ఉపాధ్యయుడు జగదీష్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ తరగతులు కొనసాగుతున్నాయని అడ్మిషన్ పొందిన విద్యార్థులు పాఠశాలకు వచ్చి తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజు పాల్గొన్నారు.

పంచాయతీ భవనానికి రేకులు వేయాలి

మరికల్: మండలంలోని ఇబ్రహీంపట్నంలో నిర్మించిన కొత్త పంచాయతీ భవనానికి రంధ్రాలు పడ్డ పాత రేకులు బిగించిన మాజీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కొత్త భవనానికి పాత రేకులు వేసిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బిల్లులు రాలేదని వచ్చిన వెంటనే కొత్త రేకులు ఏర్పాటు చేస్తామని చెప్పి తప్పించుకోవడం పద్ధతి కాదని వారు డిమాండ్ చేశారు.

భూ ఆక్రమణను అరికట్టాలి..

దామరగిద్ద: మండలంలోని అన్నాసాగర్‌లో తమ పొలం పక్కన ఉన్న రైతు భూ ఆక్రమణకు పాల్పడుతున్నారని అధికారులు చొరవ తీసుకుని అరికట్టాలని రైతు భీములు ఒక ప్రకటనలో కోరారు. సర్వే నంబర్ 101లో తాము ప్రభుత్వ భూమిని అసైన్డ్ పట్టా కలిగి ఉన్నామన్నారు. పక్కా పొలంలో ఉన్న రైతు తమ పొలాన్ని అక్రమంగా బండరాళ్లతో ఉన్న భూమిని మట్టితో పూడ్చి సాగుభూమిగా మార్చేందుకు యత్నిస్తున్నాడని వాపోయారు. ఈ విషయమై గతంలో కోర్టులో కేసు ఉన్న పట్టించుకోకుండా దౌర్జన్యం చేస్తున్నాడని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

చర్చిలో ప్రత్యేకారాధన ఉత్సవాలు

ఆత్మకూర్: ఆత్మకూర్‌లోని బెత్లహేం ఎంబీ చర్చిలో ఆదివారం పరిశుద్ధ దినం సందర్భంగా ప్రత్యేకారాధన ఉత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రేవా సీపీ జర్మియా ఆధ్వర్యంలో బైబిల్ సూక్తులను వినిపించి ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు జన్మించిన డిసెంబర్ మాసంలో క్రైస్తవులు నిత్యం ప్రార్థనలు చేయాలని, నిరుపేదలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. 25న క్రిస్మస్ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను ముమ్మరంగా చేపడుతున్నామని వివరించారు.

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో నాయకులు

మాగనూర్: మండల డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు హైమావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర తెలిపారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శులుగా స్పందన, ఉపాధ్యక్షుడిగా అమ్మన్న, సహాయ కార్యదర్శిగా శిరీషను ఎన్నుకున్నట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ.. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ కామన్ స్కూల్ విద్యావిధానం కోసం, రెండు దశాబ్దాలకు పైగా విద్యారంగం కేంద్రంగా పోరాడుతుందన్నారు. ఉపాధ్యాయుల తరఫున నిలబడుతూ పాలకులను ప్రశ్నిస్తుందని జీఓ 317మొదలు, ఎఫ్‌ఎల్‌ఎన్ టాస్క్‌ఫోర్స్, శాస్త్రీయత లేని పాలకుల విధానాలను నిరంతరం ప్రశ్నిస్తుందని అన్నారు. ఒకే పాఠశాలలో చదివేలా కామన్ స్కూల్ విద్యావిధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదరా పోదాం మన్యంకొండ



పాదయాత్రలో పాల్గొన్న సంతోషాచార్యులు తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ధర్మవాహిని పరిషత్ పాలమూరు ఆధ్వర్యంలో రెండోసారి ఆదివారం 'పదరా పోదాం మన్యంకొండ' కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. జిల్లాకేంద్రం బండ్లగేరిలో గల రుక్మిణి పాండురంగస్వామి దేవాలయం నుంచి దాదాపు 800 మంది భక్తులు మన్యంకొండ దేవాలయానికి పాదయాత్రగా వెళ్లారు. బండ్లగేరి నుంచి ప్రారంభమైన పాదయాత్ర రాంమందిర్ చౌరస్తా, గ్రంథాలయం, వన్‌టౌన్, బండమీదిపల్లి, పాలమూరు యూనివర్సిటీ, ధర్మాపూర్ మీదుగా మన్యంకొండ దేవాలయం వరకు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో భక్తులు పాదయాత్రకు స్వాగతం పలికారు. లక్ష గోవింద నామస్మరణ, భజనలు, హరినామస్మరణతో భక్తియాత్ర మన్యంకొండ దేవాలయం వరకు కొనసాగింది. ఉదయం 7 గంటల సమయంలో ప్రారంభమైన పాదయాత్ర మధ్యాహ్నం 2 గంటలకు మన్యంకొండ దేవాలయానికి చేరుకుంది. పాదయాత్రకు దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదనాచారి స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవాహిని పరిషత్ వ్యవస్థాపకులు జ్యోషి సంతోషాచార్యులు మాట్లాడుతూ లోక కల్యాణం కోసం రెండోసారి మన్యకొండకు పాదయాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో స్వరలహరి కల్చరల్ అకాడమీ అధ్యక్షులు నాయిని భాగన్నగౌడ్, మన్యంకొండ దేవస్థానం బోర్డు సభ్యులు శ్రవణ్‌కుమార్, శాంతన్న, అంజయ్య, గంగాపురం పవన్‌కుమార్‌శర్మ, రామకృష్ణశర్మ, నరేష్, ధర్మవాహిని సభ్యులు పాల్గొన్నారు.

రజక సంఘం మండల అధ్యక్షుడిగా రవి



ప్రతిజ్ఞ చేస్తున్న సభ్యులు

నర్వ: రజక సంఘం మండల అధ్యక్షుడిగా పి.రవిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక బీసీ భవనంలో మండల సమావేశం నిర్వహించారు. ఇందులో గౌరవ అధ్యక్షుడిగా సంజన్న, సలహాదారులుగా జగన్నాథం, బుచ్చన్న, మండల అధ్యక్షుడిగా రవి, ఉపాధ్యక్షుడిగా యాదేష్, రమేష్, భీమేష్, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, సహాయ కార్యదర్శిగా విజయ్ కుమార్, కమిటీ సభ్యులుగా ఎర్రబుచ్చన్న, నర్సింహులు, రాజు, వెంకటేష్, సురేష్, సత్యన్న, గోపి, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన కమిటీని గౌరవ అధ్యక్షుడు సంజన్న ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నమెంట్‌కు బయలు దేరిన విద్యార్థులు

నారాయణ ఎడ్యుకేషన్: హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ గ్రౌండ్‌లో జరిగే జూనియర్స్ బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు జిల్లా కబడ్డీ జట్టు బయలు దేరినట్లు ఆర్గనైజ్ సెక్రటరీ వెంకటప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి పాల్గొని క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసి, రాష్ట్ర స్థాయిలో సత్తాచాటి విజేతలుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మీన కుమారి, రేణుక, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ టోర్నమెంట్ బయలుదేరుతున్న క్రీడాకారులు

నాణ్యమైన విద్య అందించాలి



పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మక్తల్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ అన్నారు. ఆదివారం మండలంలోని సంగంబండ వద్ద కేజీబీవీ పాఠశాల ఎదుట బైఠాయించి విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరికి మద్దతుగా పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘాలు పాల్గొన్నాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పది రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో విద్యార్థులకు బోధన చేసేవారు కరువయ్యారని అన్నారు. పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైన ఈ సమయంలో ఉపాధ్యాయులు సమ్మెలో పాల్గొనడంతో సిలబస్ పూర్తికాకుండా విద్యార్థులు పూర్తిగా నష్టపోతున్నారని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, రాకేష్, గణేష్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మరికల్: శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆదివారం జాతీయ గణిత దినోత్సవం మండలంలోని డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కరస్పాడెంట్ హన్మంతురెడ్డి మాట్లాడారు.. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో శ్రీనివాస రామానుజన్ ప్రముఖులని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, లక్ష్మికాంత్, రాము, పీఈటీ అఖిల్ పాల్గొన్నారు.

కరాటేలో ఆత్మకూర్ విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న బిత్తిరి సత్తి

ఆత్మకూర్: న్యూమాంగ్స్ కుంగ్‌ఫూ సౌత్‌ఇండియా పోటీల్లో ఆత్మకూర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి చాంపియన్‌షిప్ సాధించారని కరాటే మాస్టర్ నరేందర్ తెలిపారు. ఆదివారం షాద్‌నగర్‌లో రతన్‌టా మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆత్మకూర్‌కు చెందిన అరవింద్ చాంపియన్‌షిప్ సాధించడంతో పాటు గోల్డ్ మెడల్‌ను సాధించగా.. రమ్యశ్రీ, శ్రీలేఖ, ఇంతియాజ్ సిల్వర్ మెడల్, సోహెల్ బ్రౌన్ మెడల్‌ను సాధించారు. నటుడు బిత్తిరి సత్తి, సీనియర్ మాస్టర్లు కనకంయాదవ్, బాలరాజు, తాజుద్దీన్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్లు రహ్మతుల్లా, అమర్, శివ, రాము, స్థానికులు అభినందించారు.

నేటి నుంచి పల్లెల్లో ఉర్సు

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లి గ్రామంతో పాటు నాగల్‌కడ్మూర్, ధర్మాపురం గ్రామాల్లో వెలసిన శ్రీసయ్యద్‌షా మహబూబ్ ఉస్సేనీ దర్గా షరీఫ్ ఉర్సు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఆదివారం రాత్రి గంధోత్సవాన్ని ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం దర్గా వద్ద భక్తులు కందూర్‌లను నిర్వహించి తమ తమ మొక్కులను చెల్లించుకుంటారని తెలిపారు. ఉర్సు సందర్భంగా దర్గా షరీఫ్‌లను విద్యుత్ బల్బులతో అలంకరించారు. ఆయా గ్రామస్తులు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. భక్తిశ్రద్ధలతో దర్గాలో భక్తులు చాదర్లను సమర్పిస్తుంటారు. దర్గా సందర్శనకు వస్తున్న భక్తులకు సౌకర్యాలను కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.